International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.6, Issue-7(1), July, 2019
Impact Factor: 6.023

# చిలకమర్తి వారి సత్యభామ

డా॥ ద్వివేది కృష్ణ గాయత్రి
తెలుగు అధ్యాపకురాలు
వి.కె.వి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల
కొత్తపేట

సత్రాజిత్తు కుమార్తె సత్యభామ ధైర్యవంతురాలు. పుట్టింటి నుంచి శమంతక మణిని తెచ్చుకోవడం వల్లనేమో గడసరి నాయికగా కనబడుతుంది. నాచన సోమనాథుడు, పోతన సత్యభామలో ఖండిత అయిన శృంగార నాయికనే దర్శించారు. యుద్ధ రంగంలో ఆమె వీరోచిత వీర విహారాన్ని వర్ణించినపుడు కూడా ఆమె సౌందర్యాన్నే వర్ణించారు సోమన, పోతనలు. సత్యభామ యుద్ధం చేసిందే తప్ప ఎవ్వరినీ చంపలేదు. సత్యభామ చేత ఎవరినీ చంపించలేదు కవులు. దాదాపుగా ఇదే విధంగా చిలకమర్తివారు నరకాసురవధ నాటకాన్ని రచించారు. అయితే స్త్రీలు చదువులలో గానీ, యుద్ధరంగంలో గానీ, సామాజిక రంగాలలో గానీ ఎందులోనూ తీసిపోరని ఆనాటి సామాజిక పరిస్థితులలో స్త్రీ సముద్ధరణను అంతర్లీనంగా ధ్వన్యాత్మకంగా నిర్దేశిస్తూ సత్యభామ పాత్రను తీర్చిదిద్దారు లక్ష్మీనరసింహంగారు. యుద్ధరంగంలో సత్యభామ పాత్రను సోమన, పోతనల్లాగే శృంగార మూర్తిగా వర్ణించారు. ఈ పద్యం చూద్దాం.

సీ॥ శ్రమ మేన బొడమిన చెమట చిత్తడి చేత
  గస్తూరి తిలకంబు కరగిపోవ
నృత్యము బొనరించు నెమలి పింఛమయట్లు
  వెడద వేనలి జాఱి వెన్ను నిండ
దియ్యవిల్తుండూగు తీగె యుయ్యెలలట్టు
  లాణి ముత్తెపు సరులల్లలాడ
గుణ నినాదమునకు గొనబైన లయవోలె
  ముంజేతి కడియముల్ మెరయుచుండ

గీ॥ నవనవాంగకముల శోభ నవయకుండ
నవకమించుక యేనియు నలగకుండ
వెడద తూపులు చూపులు వింట గంట
బరుని మీదను నామీద బరపి తబల

సత్యభామ తానూ యుద్ధానికి వస్తానని శ్రీకృష్ణునికి కబురు చేయమని దారకునికి చెప్పగా, దారకుడు ఆడవాళ్ళు ఏం యుద్ధం చేస్తారని, యుద్ధానికి తగరని పలికాడు. ఆ మాటలకు సత్యభామ శ్రీకృష్ణుడే స్త్రీలు యుద్ధం చేయవచ్చునో, చేయకూడదో నిర్ణయిస్తాడని గడసరిగా పలికింది.

క॥ "మగవారి నెల్ల వనులకు
దగువారినిగా నొనర్చి, దైవము స్త్రీలన్
దగనటు చేసెనే, మగువలు
తగియెదరొ తగరొ దైత్య దమనుడ యెఱుగున్"

తర్వాత దారకుడు సత్యభామ యుద్ధాన్ని చూసి పురుషులే తప్ప స్త్రీలు యుద్ధం చేయలేరన్న తన అభిప్రాయాన్ని మార్చుకొన్నాడు.

సత్యభామ మాటలను కృష్ణుడు ఏకీభవిస్తూ చెప్పిన ఈ పద్యం స్త్రీ అభ్యుదయానికి ఆధారభూతమైన పద్యం.

మ॥ "చదువన్నేర్తురు పూరుషులంబలెనె శాస్త్రంబు ల్పఠింపించుచో
నదమన్నేర్తురు శత్రుసేనల ధనుర్వ్యాపారము ల్మెచ్చుచో
నుదితోత్సాహము తోడ నేల గలరీ యుర్విన్ ప్రతిష్ఠించుచో
ముదితల్నేర్వగ రాని విద్య గలదే ముద్దార నేర్పించినన్"

ఈ రెండు పద్యాలు సార్వకాలికములు.

సత్యభామ యుద్ధానికి తానూ వెంట వస్తానని శ్రీకృష్ణునితో పలుకగా శ్రీకృష్ణుడు రమణులను వెంటబెట్టుకుని రణరంగమునకు వెళ్ళరాదని అన్నప్పుడు సత్యభామ ఈ విధంగా సమాధానం చెప్పింది.

సీ॥ ఆహవంబున మీరలలసిన్పుడు మేని చెమ్మటల్
దుడిచెద చెఱగు తోడ
పరుమేన శరపరంపరలేయ దమకింప
నలుగు లందిచ్చెద నండనుండి
సూతుండు శ్రాంతుడై సొమ్మవోయిన వేళ
నరదంబు గడపెద ననువెఱింగి
పగతుండు చెలరేగి పయివయిం
గవిసిన బరికొల్పి వంచెద బోరొనర్ప

గీ॥ మఱచు మనులను జ్ఞప్తికి మరల దెత్తు
గలసి చేదోడు వాదోడుగా జరింతు
వేయు నేటికి హృదయేశ! విను తెలిపెద
వాలు గైకొని పోరెద వలయునేని"

"మీరు అలసినప్పుడు చెమట తుడుస్తాను. శత్రువు నీమీద బాణాలు వేస్తున్నప్పుడు మీరు బాణాలు వేయడానికి బాణాలందిస్తాను. శత్రువు మీ మీదకి చెలరేగి వస్తున్నప్పుడు అతని ధాటిని శరపరంపరతో ఆపి మీకు కొంత శ్రమ తగ్గిస్తాను" అని చెప్పింది.

కృష్ణుడు నీవు ఈ విద్యలన్నీ ఎప్పుడు నేర్చితివి అని అడుగగా సత్యభామ చెప్పిన పద్యం ఇది.

గీ॥ "విల్లు వంచుట, కూర్చుట, వింటినారి
నలుగు దొడుగుట యేయుట, యద నెఱుగుట
రథము దోలుట, మొదలైన రణపు మనులు
చిన్న నాటను మా తండ్రి చెప్పె గొంత"

సత్యభామ తన ఆత్మాభిమానాన్ని చాటుకొన్న పద్యం ఇది.

చ॥ "అనయము భోజరాజ సుత యట్టులు జాణను కాను గాని, నా
సనువును వీరొనర్చుటకు బట్టపు దేవిని గాను గాని, నే
నును నొక రాచ కన్నియనె, న్యూనత కోరువ, నింత మాత్రపుం
జనువుల కేనియుం దగదు సత్యయటంచును నేడెఱింగితి న్"

కృష్ణుడు సత్యభామను ఇలా మెచ్చుకున్నాడు.

గీ॥ "సాటి యెఱుగని నీమేని చక్కదనము
ముందు సతులెంత సిగ్గును బొంద గలరొ
ప్రతి యెఱుంగని నీ పరాక్రమము ముందు
పురుషులంతియ సిగ్గను బొంద గలరు"

ద్వావర యుగంలో ఉన్న విశేషాలలో స్త్రీ , పురుషభావాన్ని వహించి యుద్ధం చేయడం ముఖ్యమైనదని కవి శ్రీకృష్ణునిచే పలికించారు.